# పవిత్ర యుద్ధం

పాతను రోతగాను, కొత్తదనాన్ని ఓ వింతగాను స్ఫురింపజేస్తూ, అంతఃపురంలో ఒదిగిన అతిలోకసుందరిలా, అసూర్యంపశ్యలా పరదాల్లోంచి పొంచి చూస్తూ, 'ఇదిగో వొస్తున్నా,' 'ఇదిగిదిగో వొచ్చేస్తున్నా' అంటోన్న కొత్త సంవత్సరం-

ఇంకా గోడకు తగిలించని కొత్త కేలండరులా, పోస్టు చెయ్యని గ్రీటింగ్‌కార్డులా, కెమెరా ముందరికి రాబోతూ తుదిమెరుగులు దిద్దుకుంటోన్న పడుచుతారలా, ఇప్పుడో, ఇంకాసేపటికో కౌగిట్లోకి రానున్న కొత్త పెళ్ళికూతురిలా ఊరిస్తూ, మురిపిస్తూ-

టౌన్‌లో వీధివీధికీ, బారబారకూ ఎప్పటిలాగా ఏడాది కోమారు వెలసే సీజనల్ దుకాణాలు రకరకాల, రంగురంగుల గ్రీటింగుల హారంగులను ఊరేగించి మొరవపారే నేలపట్టు చెరువులా నింగీ నేలా హోరెత్తించి వట్టిపోతున్న తరుణంలో-

రానే వచ్చింది! వచ్చింది వచ్చింది నూతన సంవత్సర శుభాంగి!

పరుగుపందెంలో బాలభానుణ్ణి ఓడించి పకపకలాడుతూ ముందుకు ఉరికి వచ్చే తొలి కిరణబాలలా పడుతూలేస్తూ తూరుపు వాకిళ్ళు తెరుచుకుని పట్నపు దుకాణాల ముంగిళ్ళలోని చెత్తాచెదారం తొక్కుకుంటూ మెయిన్ రోడ్డు వెంట పరుగుతీసి, పడమట మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటువంకలో టక్కున ఆగింది.

టక్కున ఆపివేసేటంత విశేషం ఏముంది ఊటువంకలాంటి చిన్నపల్లెలో, సిగ్గుబరువుతో సాగిపోయే అక్కడి గాలిలో? ఉసిరిక కాయలతో పోటీపడుతూ రేగి పిందెలలోని వగరుల రిమరిమలు, దోర చింతకాయల్లోని పులుపుల చిమచిమలు, ఈడొచ్చిన చెరకు గడలలోని తియ్యదనాల గమగమలు- అన్నీ కలగలిసిన కమ్మని గాలులు! వెల్లువై ముంచెత్తుతూ, 'కాలమా ఆగిపో' అని సాదరంగా కేకలేస్తూ, ఊటలెత్తిన కసిరుచుల వాగులూ, వంకలూ!

చెక్కుటద్దాల మీద మంచుముత్యాలు జాలు వారుతుండగా వసంతుడి కోసం నిక్కినిక్కి చూస్తూ ఇళ్ళ పెరళ్ళలో, పొలాల కంచెల్లో తొందరపడి ముందుగానే పూచిన బంతిపూబంతులు. పసుపు ముద్దల్లా, పాపమెరుగని ముగ్ధల్లా మంచుముసుగులో వెల్లకిలా పడి ఒళ్ళుమరిచి నిద్రపోతున్న గుమ్మడిపూలు!

'ఒసే సంకురాత్రి నెచ్చెలీ! ఏడాదిపొటు ఉండి వెళ్ళే నాకంటే నెల నాళ్లుండి వెళ్ళే నువ్వేకదా భాగ్యవంతురాలివి! ఏడాదికోసారి చుట్టపుచూపుగా వచ్చి పండగా పబ్బమూ చూసి తృప్తిగా వెళ్తావు నువ్వు. నా సంగతి అలా కాదే!' అంటూ ఈసుతో నిట్టూర్చింది ఆంగ్ల సంవత్సరాది.

ఎల్ల లోకము లొక్క ఇల్లై, జాతి భేదములన్ని కల్లై గుండెలన్నీ కలిసి బృందగానం ఆలపించే సంక్రాంతి వస్తుంది రేపు. వచ్చి తీరుతుంది. ఆ సంక్రాంతికి స్వాగతం పలకటానికి కొత్తసంవత్సరం పరతెంచి రావాలి కదా ముందుగా?

✪ ✪ ✪

సూర్యుని వాకిళ్ళు ఎరుపు. నరనారీ రక్తమెరుపు. మనిషి కనుల కాంతి ఎరుపు. మనసులోని కోరికెరుపు. ప్రాణకాంతి పుంజమెరుపు. చలి తీర్చే ఉష్ణమెరుపు. ఆకలెరుపు. దాహమెరుపు. రేపు ఎరుపు. పిలుపు ఎరుపు. స్నేహం, బాంధవ్యం అని చెప్పుకునే సేతు వెరుపు!

ఎంత చక్కనిది ఎరుపు!

పచ్చకోక కట్టుకున్న పల్లెపడుచు నుదుటి కుంకుమ బొట్టులా ఊటువంకలో ఎరుపు కనిపిస్తుంది ఓచోట కొట్టవచ్చినట్టు! రోడ్డుపక్కన, రేపో, మాపో పడిపోతుందేమో నన్నట్లున్న ఓ పాత పూరిపాక. ఆ పాక కిటికీ చువ్వలను సన్నటి ఇనుప తీగతో చుట్టి పట్టుకుని, మొగుడెత్తుకున్న కొత్త మగనాలిలా ఎర్రటి సిగ్గులొలకబోస్తున్న మూరెడు పోస్టు డబ్బా.

ఆ పాక పోస్టాఫీసు కాదు. ఆ ఊరి ప్రాథమిక పాఠశాల. టౌన్ నుంచి రోజూ పోస్టుమన్ వస్తాడు. పడమటి పల్లెల్లో ఉత్తరాలు బట్వాడా చేసి, పోతూ పోతూ ఆ పోస్టుడబ్బా తెరచి అందులోని ఉత్తరాలు పట్టుకుపోతాడు.

ఊళ్ళోని దేవుళ్లూ, బడీ, పోస్టుడబ్బా ఊరుమ్మడి సొమ్ములు. ఇవంటే పిల్లలకు భక్తీ గౌరవమూ!

కొత్త సంవత్సరం అడుగుపెట్టిన మర్నాడు-

పంతులుగారు ఇంకారాలేదు. ఆయన పేరు దాసు. టౌన్‌లో కాపురం ఉంటున్నాడు. రోజూ సైకిల్‌పైన వస్తాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్ళిరావటానికి చాలినంత వ్యవధి లేదు కనుక క్యారియర్ వెంట తెచ్చుకుంటాడు.

గంట ఇంకా తొమ్మిది కాలేదు. పిల్లలంతా పలకా పుస్తకాలతో బడికొచ్చేశారు. అందరిలోనూ చాన్‌బాషా గొంతే విలక్షణంగా ఉంది. వాడు బడికి రావడం తరువాయి, ముఖ్య స్నేహితులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాడు. "రేయ్! హేపీ నూ ఇయర్ రా! రేయ్ బాలాజీ! నీకు హేపీ నూ ఇయర్... ఆంజీ ఆంజీ నీక్కూడా. అందరికీ హేపీ న్యూ ఇయర్!

"ఏందిరా అట్టంటే?" అన్నాడు ఆంజీ.

"రేయ్! మీకేం తెల్దురాబ్బా. అట్ట చెప్పాల. తిర్పతినుంచి లెడ్డివాల్లింటికి పిలకాయిలు వొచ్చినార్లేరా. వాల్ల మనమల్లు, మనుమలాల్లు. వాల్లు కూడా చెప్పినారు నాకు హేపీ నూ ఇయర్".

చాన్‌బాషాకు ఒక్కోసారి 'ర' కారం పలకదు. అందుకు బదులుగా 'ల' కారం పలుకుతుంది. రెడ్డిని లెడ్డి అంటాడు. రత్నక్కను లత్నక్క అంటాడు.

చాన్‌బాషా రెండో తరగతి చదువుకుంటున్నాడు. వాడంటే అందరికీ ఇష్టం. పంతులుగారిక్కూడా. చానూ పొట్టిగా ఉంటాడు. చామనచాయ. నున్నటి క్రాపు. గుండ్రటి ముఖం. పెద్ద కళ్ళు. కొద్దిగా నత్తి. ముద్దముద్దగా దొర్లే ముద్దుమాటలు. ఆ మాటల నిండా బోలెడు ఆశ్చర్యార్థకాలు. కొన్ని మాటల్ని ఒత్తి పలికేటప్పుడు రాలిపడే ఎంగిలి తుంపర. చూపరుల్ని ఆకర్షించే విశేషాలు ఇవన్నీ. వాడు ఎక్కడుంటే అక్కడ పదిమంది పిల్లలుంటారు.

ఎగువ ఊరు, దిగువ ఊరు అని రెండు విభాగాలుగా ఉంది ఊటువంక.

దిగువ ఊళ్ళోని వారంతా రైతులు. ముప్పై నలభై ఇళ్ళకు మించి ఉండవు వాళ్ళవి.

ఎగువ ఊళ్ళోని ఇళ్ళసంఖ్య కూడా దాదాపు అంతే ఉంటుంది. అక్కడున్న వాళ్ళంతా ముస్లింలు.

గతంలో ఈ రెండు పేర్లూ వ్యవహారంలో ఉండేవి కావు. ఇటీవలి కాలంలో రూపు దిద్దుకున్నదే ఎగువ ఊరు. టౌన్‌కు దగ్గరగా రహదారిలో ఉన్న కారణంగా కొన్ని పేద ముస్లిం కుటుంబాల వారు ఒక్కొక్కరే ఊటువంక చేరుకుని, అక్కడి పొరంబోకు స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. స్థలాలు దొరకని వాళ్ళు చౌకలో ప్లాట్లు కొనుక్కుని ఇళ్ళు కట్టుకున్నారు. వీధిలో ఓ గంగిరేణి చెట్టు ఉంటే, దాని చుట్టూ కర్రాళ్లు పేర్చి సిమెంటుతో పెద్ద అరుగు వేసుకున్నారు. చెట్టు కొమ్మల నిండా ఎర్రవీ, ఆకుపచ్చవీ జెండాలు కట్టుకున్నారు. ఆ అరుగు పేరు జెండామాను. తమ పండుగలూ పబ్బాలూ, తంతూ తతంగమూ అన్నీ అక్కడే జరుపుకుంటుంటారు వాళ్ళు. ముస్లిములూ, హిందువులూ అని తేడా లేకుండా ప్రతి శుక్రవారం ఎవరో ఒకరు జెండామాను దగ్గర పాతియా చేసి

చక్కెర ప్రసాదం పంచిపెడుతూ ఉంటారు. పాతియా అంటే అగరొత్తులు ముట్టించి, సాంబ్రాణి ధూపం వేసి దేవుడికి చక్కెర నైవేద్యం పెట్టి మొక్కు తీర్చుకోవడం.

మనిషి సంఘజీవి. ఆచారాలు, సంప్రదాయాలూ వొదులుకుని జీవించటానికి సమాజం ఇష్టపడదు కాబట్టి, ఎగువ ఊరి వాళ్లు ఊరిపక్కనున్న చెరువులో ముంపులేని చోట ఓ అర ఎకరా స్థలాన్ని ఆక్రమించుకుని చుట్టూ రాతికూసాలు పాతి ఇనుపతీగెలతో కంచెవేసి, తమకోసం ప్రత్యేకంగా గోరీస్థలం కూడా ఏర్పాటు చేసుకున్నారు.

సైకిళ్లెక్కి పల్లెల వెంట తిరుగుతూ చీరల వ్యాపారం చేసుకునే వాళ్ళు కొందరు. అదనులో దొరికే వస్తువులు సేకరించి అమ్ముకునేవాళ్ళు కొందరు. టౌనుకు వెళ్ళి కూలీనాలీ చేసుకునే వాళ్లు కొందరు. రైతుల వద్ద పనీపాటూ చేసేవాళ్లు కొందరు. పూట గడిచి పోతోంది ప్రశాంతంగా.

వాళ్ళంతా ముస్లింలన్న మాటేగానీ, తెలుగు వినసొంపుగా మాట్లాడుతారు అక్కడి రైతుల్లాగానే. కొన్ని కుటుంబాల వాళ్లయితే ఇళ్ళలో సైతం తెలుగే మాట్లాడుకుంటారు.

ఎగువ ఊరికి చెందిన కుర్రాడు చాన్ బాషా.

✪ ✪ ✪

మేస్టారొచ్చాడు.

నీడలో సైకిల్ నిలబెట్టి గంట కొట్టాడు. ప్రార్థన జరిపించాడు.

పెద్ద పిల్లలు పాకలో, చిన్నపిల్లలు పాక ముందర రావిచెట్టు నీడలో కూర్చున్నారు.

ఆ బడిలో ఉన్న రెండు కుర్చీల్లో కాస్త బాగున్నది రావిచెట్టు కిందికొస్తుంది. వెనకకాళ్ళు ఊడిపోయిన రెండో కుర్చీ పాకలో గోడకు చేరవేసి ఉంటుంది. ఏట్లో కొట్టుకుపోతున్న బట్టకోసం ఇటూ, గాలికి కొట్టుకు పోతున్న బట్టకోసం అటూ పరిగెత్తే రేవడిలా లోపలికీ బయటికీ తిరుగుతుంటాడు మేస్టారు.

రెండు నెలలుగా నేస్తాలకు ఓ కథ చెబుతున్నాడు చానూ. దానికి అంతూ పొంతూ లేదు.

టౌన్ లో సైరన్ మోగింది. గంట పదకొండు.

మేస్టారు లోపలికెళ్ళాడు. ఆగిపోయిన కథ అందుకున్నాడు చానూ. పిల్లలంతా వాడి పక్కకి జరిగికూచున్నారు.

"అప్పుడు ఆ దొంగలంతా పరిగెత్తి పోతా ఉంటే, చిలంజీవి వాళ్లను తలుముకున్నాడు. వాళ్లు దొరకనే లేదురాబ్బా."

"అప్పుడు ఒకాయన సైకిల్ దిగి ఒంటికి పోసుకుంటూ ఉన్నాడు. చిలంజీవి ఆ సైకిలెత్తుకుని ఇస్పీడ్‌గా పోతా ఉంటే సైకిలోడిది ఒకటే బొంబిడీ. చిలంజీవి సైకిల్‌తోనే డిషూం డిషూం అని కొట్టేసి నాడ్రా దొంగల్ని".

రోడ్డుమీద లారీ ఒకటి వెళ్తోందప్పుడే....

"అప్పుడు దొంగలేం చేసినారంటే, పెద్ద రాలీ ఎక్కేసినార్రా! చిలంజీవి పైకి వొచ్చిందిరబ్బా రాలీ...."

"రాలీ కాదురా. లారీ!" అన్నాడు ఆంజి.

"అదే లేరాబ్బా లాలీనే! చిలంజీవి బూడ్సు కాలితో ఒక్క తన్ను తన్నాడంతే. రాలీ లాకెట్ మాదిరిగా ఎగిరిపోయి చెరువులో పడిపోయింది. దొంగలంతా మునిగి సచ్చిపోయినారు."

శ్రద్ధగా కథ వింటోన్న మునిలక్ష్మికి చిన్న సందేహం వొచ్చింది.

"మన చెర్లో లీళ్లే లేదే".

"మన చెరువు కాదుమే... వేరే చెరువు... చిన్న గొట్టిగల్లు చెరువు".

ఎర్రగా, బొద్దుగా ఉన్న మూడేళ్ల చిన్నపిల్లాడొకడు బడిముందర తచ్చాడుతున్నాడు. వాడి కాలికి ఓ బూటు ఉంది. రెండోబూటు వాడి చేతిలో ఉంది.

"రాలీని తన్నాడు కదా చిలంజీవి. అప్పుడు ఆ బూడ్సు ఎక్కణ్ణో ఎగిరిపడి పోయిందిరా. కంటికి కనబడలేదు".

కాకి ఒకటి రావిచెట్టు మీద వాలి క్ర్‌క్ర్ అంది.

"అప్పుడు కాకి వొచ్చిందిరాబ్బా! క్ర్ క్ర్ అనింది. 'కాకీ కాకీ! నా బూడ్సు ఎక్కణ్ణో ఎగిరి పడిపోయింది. నువ్వు ఎతికి తెచ్చినావంటే నీకు ఒక చాక్లెట్ ఇస్తాను' అని చెప్పినాడు చిలంజీవి. 'ఒక చాక్లెట్ కాదు, రెండు...ఉహుఁ... ఒక డబ్బా చాక్లెట్లు ఇస్తావా?' అని అడిగింది కాకి".

ఈ కథ ఎప్పుడు పూర్తయ్యేట్లు? ఇక ముగించేద్దామని చానూ అనుకునేంత వరకు ఇలా సాగుతూనే ఉంటుందేమో?

అంతలో మట్టిరంగు యూనిఫామ్ తొడుక్కున్న పోస్ట్‌మన్ అక్కడికొచ్చాడు. డబ్బా తెరిచి అందులో ఉన్న రెండో, మూడో ఉత్తరాల్ని తీసి జేబులో కుక్కుకుంటుండగా గబుక్కున లేచాడు చాన్‌బాషా. వెళ్ళిపోతున్న పోస్ట్‌మన్ చొక్కా అంచు పట్టుకుని "అనా, అనా" అంటూ గుంజాడు.

"ఏమిరా?" అంటూ ఆగాడు పోస్ట్‌మన్.

"నాకు గీటింగ్ బొమ్మ ఒకటి ఇయ్యన్నా".

"అరెరే!" అంటూ నొచ్చుకున్నాడు పోస్టుమన్. "అన్నీ ఇచ్చేస్తినే! బొమ్మ లేదురా నాయనా. రేపు చూద్దాంలే."

చొక్కా వొదిలేశాడు చానూ. "సరేలే." పోస్టుమన్ వెళ్ళిపోయాడు.

పాక లోపల్నుంచి ఇదంతా చూస్తున్న దాసుకు నవ్వొచ్చింది. చానూ అమాయకపు ముఖం చూస్తుంటే అతనికి జాలేసింది.

సాయంకాలం బడి వొదిలేసి సైకిలెక్కుతున్నప్పుడు కూడా ఆ దృశ్యం అతడి కళ్లలోంచి మాసిపోలేదు. ఇంటి ముందర సైకిల్ దిగుతున్నప్పుడు కూడా చానూ జాలిమోమే కళ్లలో కదలాడింది.

అప్పటికే ఏదో ఆలోచించుకున్న దాసు ఇంట్లో అడుగు పెట్టడం ఆలస్యం, "గ్రీటింగులేమయినా మిగిల్నాయారా మూర్తీ?" అని అడిగాడు చిన్న కొడుకును.

బ్యాంకు క్లర్కుగా కొత్తగా ఉద్యోగంలో చేరిన అతడి పెద్ద కూతురు బ్యాంకువాళ్ళు ముద్రింపించిన గ్రీటింగ్ కార్డులు కొన్ని ఇంటికి పట్టుకొచ్చింది, వారం రోజుల కిందట. పిల్లలు ఎవరికి కావల్సినన్ని వాళ్ళు పుచ్చుకుని స్నేహితులకు పంపుకున్నారు. ఒకటో రెండో మిగిలి ఉండవా అని దాసు ఆశ.

అతను ఆశించినట్లే ఇంట్లో ఉండనీ అని రకానికొకటి చొప్పున మూడు గ్రీటింగులు అట్టిపెట్టాడు మూర్తి. పాలనురుగులాంటి తెల్లటి, నున్నటి మేలిరకం కాగితాల మీద ఆకర్షణీయమైన రంగులతో మూడు బొమ్మలు. తిరుపతి వెంకన్న, ఏసుక్రీస్తు, మక్కా మసీదు.

ఆ మూడింటినీ మేజామీద పెట్టుకుని మార్చి మార్చి చూశాడు దాసు. మేజా సొరుగులోంచి ఓ ఖాళీ కవరు పైకి తీశాడు. దాని మీద చాన్‌బాషా స్కూల్ ఎడ్రస్ రాశాడు. తపాలాబిళ్ల అంటించాడు. మక్కా మసీదు ఉన్న గ్రీటింగ్ తీసి కవర్‌లో పెట్టాడు.

"దీన్ని ఇప్పుడే పోస్ట్ చేసెయ్‌రా మూర్తీ" అన్నాడు.

ఆ రాత్రి అన్నం తిని వెల్లకిలా పడుకున్నప్పుడు తలనిండా చాన్‌బాషా గురించిన ఊహలే. ఈ గ్రీటింగ్ ఎవరు పంపిందీ తెలియదు కదా వాడికి? రేపు పోస్ట్ అందుకునేప్పుడు ఎలా ఉంటుందో వాడి మొహం? బొమ్మ చూసుకున్నాక ఎలా ఉంటాయో వాడి ఊహలు?

ఆలోచనలతో తానే ఓ చిన్న పిల్లాడైపోయి నిద్రపోయాడు దాసు.

✪ ✪ ✪

పోస్ట్‌మన్ కోసం పడమటి పల్లెల్లో ఏ మిలిటరీ వాడి పెళ్ళాం ఎదురు చూస్తోందోగానీ, అంతకంటే తక్కువ ఆత్రుత కాదు దాసుది. ఉదయం

పదిగంటలకు రావిచెట్టు నీడలో కుర్చీ వేసుకు కూచున్నవాడు అక్కణ్ణించి మరి లేవలేదు.

ఆఖరికి రానే వచ్చాడు పోస్టుమన్. ఎడమ చంకలోని ఉత్తరాల గుత్తిలోంచి కవరు లాగి పట్టుకుని "చాన్‌బాషా ఎవరు సార్?" అన్నాడు.

చివుక్కున లేచి నుంచున్నాడు చానూ. "నువ్వేనా? ఇందా" అంటూ వాడికి కవర్ అందించాడు పోస్టుమన్. "నిన్న బొమ్మడిగినావు గదా? ఇందా, తీసుకో ఇది కూడా" అంటూ ఎవరిదో మరో కవరులోంచి ఓ గ్రీటింగ్ లాగి వాడి చేతికిచ్చి, కవరును ముక్కలుగా చించి ఉండగా నలిపి దూరంగా విసిరేశాడు. డబ్బా తెరచి, మళ్లీ మూసేసి వెళ్ళిపోయాడు.

దాసు చానూ వైపే చూడసాగాడు, కన్నార్పకుండా.

వాడికి బలే సంతోషంగా ఉంది. ముందుగా పోస్ట్‌మన్ ఇచ్చిన బొమ్మలోకి చూసి, "అరే! వెంకటేసుల్సామిరా! అబ్బ ఏముందిరా!" అంటూ మురిసిపోయాడు. బ్యాంకువాళ్ళ గ్రీటింగ్ కార్డే అదీను.

తరువాత కవరులోని బొమ్మను బయటికి తీశాడు. "అరేవ్వా! మా అల్లాసామిరా" అన్నాడు.

బొమ్మలు దొరికాయన్న సంబరమే తప్ప, అవి ఎలా వచ్చాయోనన్న ఉత్సుకతే వాడి మొహంలో లేదు.

"ఇట్ల తేరా చానూ వాట్ని" అన్నాడు దాసు. వాటిని తెచ్చి ఆయన చేతబెట్టాడు వాడు.

"ఎవరు పంపిరిరా నీకివి?"

"పోస్ట్‌మేన్ ఇచ్చినాడు సార్!"

"పోస్ట్‌మేన్ ఇచ్చింది ఒకటేరా, ఈ వెంకటేశ్వరస్వామి బొమ్మ! ఈ మక్కా మసీదు బొమ్మ మాత్రం నీదే, చూడు, కవరుమీద నీపేరు కూడా ఉంది. ఎవరు పంపించి ఉంటారు?"

ఆలోచనలతో చానూ కళ్ళు బరువెక్కాయి.

"మా తాత పంపినాడు సార్. పోస్టులో వచ్చింది".

"మీ తాతా!"

"ఔన్సార్-చిన్న గొట్టిగల్లులో ఉండాడు మా తాత."

"ఎంత మంచోడురా మీ తాత".

"ఔన్సార్, నాకు గుడ్డలు కూడా కుట్టిచ్చినాడు మా తాత.

" ఆఁ- గుడ్డలు కూఢా కుట్టిచ్చినాడా, ఎప్పుడు ?"

"అప్పుడు..." బుగ్గలు పూరించి అన్నాడు చానూ.

"ఎప్పుడూ"?

"అప్పుడు"!

దాసు ముఖం నిండా తుంపరే!

ఆ సాయంకాలం బడి వొదిలే లోపున రెండు మూడు సార్లు అడిగాడు దిగువ ఊరి కుర్రాడు బాలాజీ, "ఒరే చానూ! రెండు బొమ్మలు ఏలరా నీకు? మసీదు బొమ్మ నాకియ్యవా?" అని.

"ఊఁ? బలే ఆశరా నీకు".

"పోన్లే. వెంకటేసరసామి బొమ్మయినా ఇయ్యి."

"ఆఁ? వెంకటేసుల్సామి బొమ్మే కావాల నాకు".

"అట్టయితే, మసీదు బొమ్మయినా ఇయ్యి".

"నువ్వు పోరాబ్బా" అంటూ విసుగ్గా తల బాదుకున్నాడు చానూ.

బడి వొదిలిన అరగంటకు చానూ ఇంటికొచ్చి, "ఆడుకుందాం రారా" అని పిలిచాడు బాలాజీ.

వాడు బయటికొచ్చాక, "నా దగ్గర మూడ్రూపాయలుందిరా" అన్నాడు గర్వంగా.

"యాడ్డిరాబ్బా అంత దుడ్లు నీకు?"

"మా మామ ఇచ్చినాడు".

"ఎంత మంచోడ్రాబ్బా మీ మామ!"

"ఏమన్నా తీసి తిందాంరా చానూ! మనిద్దరమే."

"వొద్దురాబ్బా".

చానూ అలా అన్నాడే కానీ, జిహ్వను గెలవలేక పోయాడు. అంగట్లో వేడి వేడి వడలు కొనుక్కు తిన్నారిద్దరూ. డబ్బు అయిపోయింది.

అప్పుడన్నాడు బాలాజీ, "రేయ్ చానూ, నాకొక బొమ్మ ఇయ్యవా రా?"

"పెద్ద గాచ్చారమై పోయిందిరాబ్బా నీతో" అంటూ తల బాదుకున్నాడు చానూ. "సరే, నీకు మసీదు బొమ్మ ఇచ్చేస్తా. వెంకటేసుల్సామి బొమ్మ మాత్రం అడగొద్దు."

బాలాజీ కళ్ళు విజయానందంతో మెరిశాయి. "నాక్కావల్సింది మసీదు బొమ్మే. తెచ్చియ్యిరా".

"రేపు ఇస్తాను. మా నాయనకు చూపించాల కదా? ఇంకా రాలేదు మా నాయన.

"నిజ్జంగా ఇస్తావుగదా రేపు?"

"రేయ్! అపద్దం కాదురా, అల్లా సాచ్చిగా - వెంకటేసరస్వామి సాచ్చిగా".

✪ ✪ ✪

లోకంలో జరిగే అన్యాయాలకూ, అక్రమాలకూ అల్లాసామీ, వెంకటేశ్వరస్వామీ వచ్చి తీర్పులు చెప్పేట్లయితే ఎంత బాగుండునో?

మర్నాడు బడికి కాస్త ఆలస్యంగా వచ్చిన బాలాజీకి అన్యాయమే జరిగిపోయింది. చిన్న తరగతులకు పాఠం చెప్పి, చెప్పిన పాఠాన్ని బిగ్గరగా పల్లెవేయమని పిల్లల్ని పురమాయించి పాకలోకి వెళ్ళాడు మేస్టారు.

అప్పుడొచ్చాడు బాలాజీ. లోపలికెళ్లి మేస్టారిచేత వేడివేడిగా ఓ చిన్న దెబ్బ ఇప్పించుకుని, చానూ దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

"బొమ్మ తెచ్చినావారా చానూ?"

"ఉండురాబ్బా, ఇస్తా" అంటూ సంచీలోంచి నోట్ బుక్ బయటికి లాగి పేజీలు తిప్పాడు చానూ. అందులో వెంకటేశ్వరస్వామి బొమ్మ ఒక్కటే ఉంది. రెండోది లేదు. "అరే! యాడికి పోయిందిరా?" అని ఆశ్చర్యపోతూ వాచక పుస్తకం తిరగేశాడు. అందులోనూ లేదు. గబా గబా సంచీ తిరగేసి విదిలించాడు. పాతబ్లేడు, పెన్సిలు ముక్క, మొండి బలపాలు, చింతకాయ బొబ్బళ్ళు, అగ్గిపెట్టె సైజు సినిమా తారల బొమ్మలు, దుమ్మూ ధూళీ మాత్రమే రాలాయి.

"అరే! మసీద్ బొమ్మ ఎవరో ఎత్తుకునేసినార్రా".

కోపంతో చానూ జుట్టు పట్టుకున్నాడు బాలాజీ.

"అరే, నిజంరాబ్బా ఎంటికలు ఇడ్సిపెట్టు".

"అంతా అపద్దాలు" అంటూ బాలాజీ వాడి చెంప వాయించి కిందికి పడదోశాడు. రావిచెట్టు కింద దుమ్ములో ఇద్దరూ దొర్లాడుతుంటే మేస్టారొచ్చి విడిపించి, సంగతి అడిగి తెలుసుకున్నాడు. అందరి సంచులు, పుస్తకాలు వెతికించాడు. ఎవరి దగ్గరా లేదు బొమ్మ.

"ఇంటికి పోయి చూడరా. ఇంట్లోనే ఉందేమో?"

"లేదార్సర్. ఇస్కూలుకి తెచ్చినా".

"పోతే పోయిందిలే, ఊరుకోండి. దానికోసరం ఎందుకు రంపు?"

ఒంటికి గంట కొట్టాడు మేస్టారు.

మధ్యాహ్నం ఇంటికి గంట కొట్టినప్పుడు బడి ముందర ప్రత్యక్షమైంది బాలాజీ తల్లి ఝాన్సీరాణి. పాలోమంటూ ఇళ్లకు వెళ్ళిపోతున్న పిల్లల్లో నుంచి చానూను కళ్ళతో గుచ్చి పట్టుకుని "ఒరే చానూ, ఇట్ల రా" అంది.

"ఏమికా?" అంటూ దగ్గరికెళ్ళాడు చానూ.

"ఏం బొమ్మ(లా అవి? చూపించూ".

చానూ పుస్తకం తెరిచి చూపించాడు. "ఇది ఒకటే ఉందక్కా. ఇంకొకటి లేదు."

ఆమె ఆ బొమ్మను అందుకుంది. "ఏమి న్యాయంరా నీ న్యాయం? వాడి చేత మూడు రూపాయలు ఖర్చు బెట్టించి, ఇప్పుడు బొమ్మలేదంటావా? మసీదు బొమ్మ తెచ్చిచ్చి ఈ బొమ్మ తీసకపో" అంటూ ఇంటి ముఖం పట్టింది.

చూస్తూనే ఉన్నాడు దాసు. అతని మొహం చిన్నబోయింది. బాధ వేసింది.

ఇంతలో చానూ బిగ్గరగా " నా వెంకటేసుల్సామి... నా వెంకటేసుల్సామి" అని ఏడుస్తూ నేల మీద పడి పొర్లడం మొదలెట్టాడు. దాసు వెళ్ళి లేపి నుంచోబెట్టి "దీనికే ఎందుకురా ఏడుపు? ఊరుకో-రేపు అట్లాంటిదే ఇంకొక బొమ్మ తెచ్చిస్తాన్లే నీకు" అంటూ సముదాయించబోయాడు.

వాడు మేస్టార్ని విదిలించుకుని, కాలువలు గట్టి పారుతున్న కన్నీళ్ళను మోసుకుంటూ ఇంటివైపు సాగిపోయాడు.

చానూ తండ్రి కలీముల్లా ఆ రోజు ఇంట్లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాడు. చానూ తల్లి రజియా బేగం పిల్లలకు అన్నాలు పెడదామని కంచాలు అందుకుంటోంది అప్పుడే.

కొడుకు వలవలా ఏడుస్తూ చెప్పిన వైపరీత్యం గురించి విన్న రజియాబేగంకు ఉక్రోషం బుసబుసా ఎగదన్నుకొచ్చింది. "ఓయ్యోవ్! బెల్లం గొట్టిన రాయాల ఉలకనంటావేంది? ఎట్ట ఏడుస్తా ఉండాడో జూడు బిడ్డ. ఏం జెయ్యమంటావు?" అంటూ మొగుణ్ణి కేకేసింది.

" ఏం జేస్తావో చెయ్. నాకు తెలియదు. ఆడోళ్ళతో ఎవ్వారం - నడిమద్దెన నేను దేనికి?" అన్నాడు కలీముల్లా.

రజియా అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చేసింది. కొంగు నడుముకు బిగించింది. మొగుణ్ణి అడిగి మూడు రూపాయలు తీసుకుంది. సకల శస్త్రాస్త్రాలు నోట సంధించి, దిగువ ఊరిపైకి కదనాశ్వంలా కదం తొక్కుతూ కదిలింది.

మరో పావుగంటకే మరలి వచ్చిందామె. వెంకటేశ్వరుడి బొమ్మను చానూ చేతికిచ్చింది. "ఇందా, భద్రంగా పెట్టుకో".

"ఇస్కూలు కెత్తకపోబాకరా దాన్ని. ఇంట్లోనే పెట్టు" అన్నాడు కలీముల్లా.

"సరేలే... అన్నం పెట్టుమా" అన్నాడు చానూ.

✪ ✪ ✪

సాయంత్రం బడి వదిలి - పిల్లలంతా ఇళ్ళకు పరుగులు తీస్తున్నప్పుడు సిగ్గుపడుతూ చానూ దగ్గరికొచ్చాడు ఆంజిగాడు.

"చానూ-చానూ-ఇంట్లో పుస్తకాలు పెట్టేసొస్తావా? నేనూ పెట్టేసొస్తాను. ఈడికే."

"ఎందుకు పోరాబ్బా. ఈ పొద్దు నిద్దరొస్తా ఉంది నాకు".

"కొంచెంసేపే. నీకు ఒక సంగతి చెప్పాల."

"సరే"

పది నిమిషాల తర్వాత బడి ముందరి రావిచెట్టు దగ్గర మళ్ళీ కలుసుకున్నారు వాళ్లు.

"ఏమి? చెప్పురా" అంటూ ఆవలించాడు చానూ.

"ఈ పొద్దు నావల్లే నీకు దెబ్బలు. మీ యమ్మకూ బాలాజీ వాళ్లమ్మకూ జగడం కూడా నావల్లే".

"పోరా పోరా. నువ్వేం చేసినావ్?"

ఆంజీ తలొంచుకున్నాడు. "మసీదు బొమ్మ కాజేసింది నేనే కదా!" వాడి కళ్లు తడితో మిలమిలలాడాయి.

"అరే! నిజంగా?" చానూకు నిద్రమత్తు వదిలిపోయింది.

"ఎందుకురా ఆ పని చేసినావ్? నన్ను అడిగితే ఇచ్చి ఉండనా?"

"నువ్వియ్యవు."

"ఔన్నా! కరెట్‌గా చెప్పినావ్. అది బాలాజీది. అది సరే, అయ్యవారు ఎతికినాడు కదా అందరి దగ్గిరా. ఎక్కడ దాంచి పెట్టేసినావ్?"

ఆంజీ రావిమాను తొర్రలో చెయ్యి పెట్టి మసీదు బొమ్మ బయటికి తీశాడు.

"అరెవ్వా ఏమి తెలివిరా నీకు!"

ఇంతలో బాలాజీ కనిపించాడు దూరంగా.

"బాలాజీ! రేయ్, బాలాజీ! ఇక్కడ రారా" అని ఎలుగెత్తి పిలిచాడు చానూ.

వాడు వీళ్ళవేపు ఓసారి చూసి, తల తిప్పుకున్నాడు.

"ఇదోరా... నీ మసీదు బొమ్మరాబ్బా" అంటూ బొమ్మతోబాటు చెయ్యి పైకెత్తి కేకేశాడు చానూ.

ఆ మాట వినగానే పరిగెత్తుకొచ్చేశాడు బాలాజీ.

"తెల్లారే ఎందుకియ్యలేదు?" అన్నాడు.

"వీడికి అర్థమే కాదురాబ్బా, ఇప్పుడే కదా ఇచ్చినాడు ఆంజీ? కదా ఆంజీ?

ఇందా, తీసుకో - అంటూ చానూ దాన్ని బాలాజీ కిచ్చేసి, క్షణం ఆగి, "పాపం, ఆంజీకి లేదు బొమ్మ" అని సానుభూతి వ్యక్తం చేశాడు.

"పర్లేదులేరా. రేపు ఇంకొక బొమ్మ తెస్తానన్నాడు గదా అయివోరు. దాన్ని అడిగి తీసుకుందాం. అది నాకు".

"ఔన్రా, బలే ఐడియా."

"ఇక్కణ్ణే ఉండండ్రేయ్. ఈ బొమ్మ మాయమ్మకు జూపించి ఇప్పుడే వొచ్చేస్తా" అంటూ పరిగెత్తుకు పోయాడు బాలాజీ.

మరో నిమిషానికల్లా తిరిగొచ్చాడు. "ఇందరా చానూ. మాయమ్మ మూడ్రూపాయ లిచ్చేసింది. మీయమ్మ కిచ్చేయ్" అంటూ వాడి చేతిలో డబ్బు పెట్టాడు.

ఓ క్షణం ఆలోచించాడు చాన్‌బాషా. "ఇంట్లో ఇచ్చేది వొద్దులేరా. మనం ముగ్గురూ చాక్లెట్లు తీసి తినేద్దాం."

"మీ ఇంట్లో తిడ్తారేమోరా."

"ఎందుకు తిడ్తార్రా? నిన్న మనం వడలు తీసి తినేతప్పుడు ఎవలూ తిట్లేదే. ఇంట్లో చెప్పకపోతే కదా తప్పు." వాళ్లు అంగడి దగ్గరి కెళ్తూంటే వాళ్ళ నేస్తాలు - ఎగువ ఊరివాళ్ళూ దిగువ ఊరి వాళ్ళూ - మరో ఐదారుమంది వాళ్ళతో కలిశారు. ఆ మూడు రూపాయలూ నిమిషంలో ఖర్చయిపోయింది.

ఆ రోజు శుక్రవారం. జెండామాను దగ్గర ఎవరో పాతియా చేస్తుంటే, పిల్లలంతా పాలోమంటూ పరిగెత్తుకెళ్లి చేతిలో చక్కెర పోయించుకుని బొక్కారు. వాళ్ళలో హిందువులూ ఉన్నారు.

నాలుకలమీది తీపి ఇంకిపోకముందే - దిగువ ఊరిలో గ్రామదేవత పేర వెలసిన రాతికి ఎవరో పసుపు కుంకాలద్ది, పొంగళ్లు పెట్టి పూజ చేస్తున్నారని తెలిసి అక్కడికి ఉరుకుతూ పోయి, బెల్లం పొంగలీ, కొబ్బరి ముక్కల ప్రసాదం పెట్టించుకుని తిన్నారు. వాళ్ళలో ముస్లిం పిల్లలూ ఉన్నారు.

పోట్లాడుకున్న పిల్లలు మళ్ళీ కలిసిపోయి తియ్యదనాలు పంచుకుంటున్నారు. పోట్లాడుకున్న పెద్దలు కూడా రేపు ఆ సంగతి మరిచిపోయి ఒకర్నొకరు సాదరంగా పలకరించుకుంటారు.

పేరు ఏదయితేనేం, రూపు ఏదయితేనేం, నాలుకల్ని తీపి చెయ్యడంతోబాటు గుండెల్ని కూడా తీపి చేసే దేవుడు అందరికీ దేవుడే!

'నామతమూ - నా దేవుడు' అనే భావంతో సాగే పోట్లాట పవిత్ర యుద్ధం అవునోకాదో గానీ, 'నీ దేవుడు నాకూ దేవుడే' అనే మంగళకరమైన స్పర్థను మించిన పవిత్ర యుద్ధం ఉంటుందా లోకంలో?

● ఇండియాటుడే మార్చి 6-20, 1991 ●